సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 18 । జూలై । 2024



సముద్రంలో బోటు బోల్తా

హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన బోటు ప్రమాదానికి గురైంది. అందులోని మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. 8లో



పర్యాటకానికి గ్రహణం!

విశాఖ పర్యాటకానికి గ్రహణం పట్టింది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 8లో



భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఉమ్మడి విశాఖ జిల్లాలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో మొహర్రం జరుపుకొన్నారు. దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

మత్స్యసిరులు

- మత్స్యకారుల వలకు చిక్కుతున్న భారీ సైజు చేపలు



10 కిలోల బంగారుపాప రకం చేపతో గిరిజనుడు

ముంచంగిపుట్టు: మండలంలో మత్స్యగెడ్డలో మత్స్యకారుల వలకు భారీ సైజు చేపలు చిక్కుతున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలోకి వరదనీరు భారీగా చేరుతోంది. దీంతో మత్స్యకారుల వలలకు 10 కిలోల నుంచి 15 కిలోల బరువు ఉన్న బంగారు పాప చేపలు చిక్కుతున్నాయి. వీటిని మండల కేంద్రానికి తీసుకువచ్చి కిలో రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. గిరిజనులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు.

3,4 తేదీల్లో ఫొటో ఫినా వర్క్ షాప్

- రంపచోడవరంలో బ్రోచర్ ఆవిష్కరణ
- విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడి పిలుపు



రంపచోడవరంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రంపచోడవరం: జిల్లా కేంద్రమైన కాకినాడలో వచ్చేనెల 3,4 తేదీల్లో జరిగే ఫొటో ఫినాను విజయవంతం చేయాలని ఆ జిల్లా ఫొటోఅండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట చంటిబాబు కోరారు. రంపచోడవరంలో బుధవారం స్థానిక ఫొటో గ్రాఫర్లతో కలిసి ఫొటో ఫినా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫొటో ఫినా వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్, వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీకి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు, ఫొటో గ్రాఫర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

మోదమ్మకు ప్రత్యేక పూజలు

- అమ్మవారిని దర్శించుకున్న అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

పాడేరు : స్థానిక మోదకొండమ్మ అమ్మవారిని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బుధవారం దర్శించుకున్నారు.ఏకాదశి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, కూడా సురేష్‌కుమార్, రూడకోడ సర్పంచ్ కాతరి సురేష్ కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

అరకులోయ రూరల్: మండలంలోని పంచాయతీ కేంద్రం బస్కి గ్రామానికి చెందిన కిల్లో భారతి (20) అనే గర్భిణి బుధవారం 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. పురిటి నొప్పులు రావడంతో ఆమెను 108 వాహనంలో అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా దొరగుడ గ్రామ సమీపంలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని 108 సిబ్బంది పైడి బాలకృష్ణ, నీలంశెట్టి సురేష్ తెలిపారు. తల్లీబిడ్డను అరకు ఏరియా ఆస్పత్రికి తరలించామని, వారిద్దరు క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో పైసా వసూల్!

చింతపల్లిలోని వైద్యవిధాన పరిషత్ ప్రాంతీయ ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు పేరిట మామూళ్ల వసూళ్ల దందా కొనసాగుతోంది. నిబంధనలు, సాంకేతిక పరమైన సమస్యలను సాకుగా చూపుతూ గిరిజనుల నుంచి ధ్రువపత్రానికి రూ.500 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. చేసేదిలేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని పలువురు గిరిజనులు వాపోతున్నారు. ప్రశ్నిస్తే 'ప్రభుత్వం మారింది.. కొత్త సిస్టమ్ పెట్టింది.. సర్వర్ సైట్ పనిచేయడం లేదు'అని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



చింతపల్లి ఏరియా ఆస్పత్రి

- రూ.500 చెల్లిస్తేనే జనన ధ్రువపత్రం మంజూరు
- నిబంధనలను సాకుగా చూపి అక్రమాలు
- నోటరీ పేరిట దందా
- సిబ్బందిగా చలామణి అవుతున్న సూపరింటెండెంట్ భార్య
- ఆమె ఖాతాకు ఫోన్‌పే ద్వారా చెల్లింపులు
- ఉదహరిస్తున్న గిరిజనులు


చింతపల్లి రూరల్: స్థానిక వైద్యవిధాన పరిషత్ ప్రాంతీయ ఆస్పత్రిలో పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు గిరిజనుల నుంచి రూ.500 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో పుట్టిన బిడ్డకు నిబంధనల ప్రకారం ఆస్పత్రి యాజమాన్యం చొరవ తీసుకుని 21 రోజుల్లోగా ధ్రువ పత్రం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ ఆస్పత్రిలో కొంతకాలంగా అలా జరగడం లేదు. దీనిపై అడిగినప్పటికీ 'ప్రభుత్వం మారింది.. కొత్త సిస్టమ్ పెట్టింది.. సర్వర్ సైట్ పనిచేయడం లేదు.. కొద్దిరోజులు పోయిన తరువాత రండి' అంటూ పథకం ప్రకారం 21 రోజులు దాటవేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. దీనిని ఆసరాగా చూపిస్తూ నోటరీ కోసం ఒకొక్క జనన ధ్రువపత్రానికి రూ.500 వసూలు చేస్తున్నారని.. అదే మీరు బయట చేయించుకుంటే రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుందని ఆస్పత్రిలో చెబుతున్నారని వారు తెలిపారు. మా దగ్గర అయితే రూ.500తో అయిపోతుందని చెబుతుండటంతో అవస్థలు తప్పుతాయన్న భావనతో వారు అడిగిన రూ.500 చెల్లించి ధ్రువపత్రం తీసుకుంటున్నామని గిరిజనులు తెలిపారు.

ఫోన్‌పే ద్వారా చెల్లింపులు

గతంలో ఈ ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ జనన వివరాలు నమోదు చేసేవారు. అతనిపై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల మందలించారు. అతనిని వేరే విధులకు ఇటీవల మార్చేశారు. అతని స్థానంలో జూనియర్ అసిస్టెంట్‌కు డేటా ఎంట్రీపై శిక్షణ ఇప్పించి నియమించారు. ఆ ఉద్యోగితోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ భార్య కూడా ఉద్యోగిగా చలామణి అవుతూ జనన ధ్రువీకరణ పత్రానికి రూ.500 వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనన ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఈనెల 6వ తేదీన ఆస్పత్రికి వచ్చిన గిరిజనుడిని రూ.500 ఇవ్వాలని వారు పట్టుబట్టారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పినప్పటికీ వారు అంగీకరించలేదు. డబ్బులు ఇవ్వని కారణంగా మళ్లీ రావాలని చెప్పడంతో చేసేది లేక సూపరింటెండెంట్ భార్య ఫోన్ నంబర్‌కు ఫోన్ పే ద్వారా రూ.500 చెల్లించినట్టు గిరిజనుడి బంధువు తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాల నిమిత్తం వైద్యులు, సిబ్బంది నుంచి ట్రెజరీకి చెల్లించాలని చెబుతూ సూపరింటెండెంట్ భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ విచారణ జరిపితే వసూళ్ల వివరాలను చెబుతామని సిబ్బంది, గిరిజనులు తెలిపారు.

సూపరింటెండెంట్ వివరణ

ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రం శిశువు పుట్టిన 21 రోజుల్లోగా పొందాలని సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ గడువు దాటితే తప్పని సరిగా నోటరీ చేయించాలన్నారు. ఈ విధానంపై గిరిజనులకు అవగాహన లేకపోవడంతో వారి నుంచి ఆస్పత్రి సిబ్బంది ద్వారా డబ్బులు తీసుకుని చేయిస్తున్నామని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో సర్వర్ పనిచేయలేదు. అందువల్ల సకాలంలో జనన నమోదు జరగలేదన్నారు. ఆయన భార్య బ్యాంక్ ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.500 చెల్లింపుపై అడగ్గా ఆయన నుంచి సమాధానం లేదు. డబ్బులు చెల్లించిన వ్యక్తికి నోటరీ చేయించారా అని అడిగితే వారి దరఖాస్తు తమ దగ్గర లేదని సూపరింటెండెంట్ బదులిచ్చారు.



సూపరింటెండెంట్ భార్య ఖాతాకు ఫోన్ ద్వారా రూ.500 అందిన చిత్రం

ప్రమాదస్థాయికి 'డుడుమ'



డుడుమ జలాశయంలో భారీగా చేరిన వరదనీరు

- ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు
- జోలాపుట్టు నుంచి నీటి విడుదల నిలిపివేత

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. గత కొద్దిరోజులుగా సరిహద్దు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా డుడుమ జలాశయంలోకి వచ్చి చేరుతోంది. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా బుధవారం నాటికి 2,586 అడుగులుగా నమోదు అయింది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది వెంటనే ప్రాజెక్టు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో జోలాపుట్టు ప్రాజెక్ట్ నుంచి డుడుమ జలాశయానికి విడుదల అవుతున్న నీటిని నిలిపివేశారు. డుడుమ జలాశయంలో మరో నాలుగు అడుగుల మేర నీరు చేరితే ప్రాజెక్ట్‌కు ముప్పు పొంచి ఉన్నందున అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నీటి స్థాయి మరింత పెరిగితే డుడుమ నుంచి దిగువున ఉన్న బలిమెల జలాశయానికి నీరు విడుదల చేసే అవకాశం ఉందని జలాశయ సిబ్బంది తెలిపారు.

గెడ్డలకు వరద ఉధృతి



ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యూరు గెడ్డ

కొయ్యూరు: బారీ వర్షాలకు గెడ్డలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నందున కాకరపాడు,కొయ్యూరు,తీగలమెట్ట ప్రాంతాల్లోని కాలువలు, గెడ్డల్లో భారీగా వరద నీరు చేరుతోంది. వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన రేపు

పాడేరు : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ ఈనెల 19న జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు విశాఖపట్నంలో బయలుదేరి రోడ్డు మార్గాన ఉదయం 10 గంటలకు పాడేరు చేరుకుంటారన్నారు. పాడేరు గిరిజన భవన్‌లో అన్ని ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సమావేశమై స్థానిక సమస్యలు, పరిస్థితులపై చర్చిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశమవుతారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు అరకువేలి సందర్శనకు వెళ్తారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు హరిత హోటల్ గోష్ఠి సమావేశ మందిరంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ , రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం విశాఖపట్నం తిరిగి పయనమవుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

మీకోసం రద్దు

ఈనెల 19న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన నేపథ్యంలో అదేరోజు ఐటీడీఏలో నిర్వహించాల్సిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఐటీడీఏలో ఎటువంటి ఫిర్యాదుల స్వీకరణ ఉండదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి శుక్రవారం ఐటీడీఏకు రావొద్దని ఆయన సూచించారు.

డీఐజీగా గోపీనాథ్ జట్టి బాధ్యతల స్వీకరణ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన 2010 అక్టోబర్ నుంచి 2011 మార్చి వరకు గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా, 2011 ఏప్రిల్ నుంచి 2013 ఏప్రిల్ వరకు చింతపల్లి ఏఎస్పీగా, 2013 నుంచి 2014 వరకు గుంటూరు ఎస్పీగా, 2014 నుంచి 2016 వరకు తిరుపతి ఎస్పీగా, 2016 నుంచి 2017 వరకు 6వ బెటాలియన్ కమాండెంట్‌గా, 2017 నుంచి 2018 వరకు కర్నూల్ ఎస్పీగా, 2019 నుంచి 2022 వరకు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అధికారిగా, 2022 ఏప్రిల్ నుంచి గ్రే హౌండ్స్ డీఐజీగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు. గంజాయిని నిర్మూలనకు చర్యలు చేపడతానన్నారు.

మలేరియా నివారణకు చర్యలు శూన్యం

- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెరుగుతున్న కేసులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ
- జిల్లా ఆస్పత్రిలో రోగులకు పరామర్శ



పాడేరులోని జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాడేరు : ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని అందువల్ల రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఎం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం పాడేరు వచ్చిన ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. వార్డుల్లోని రోగులతో మాట్లాడారు. చికిత్స పొందుతున్న మలేరియా రోగులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవలు, మందుల వివరాలు, రోగులకు అందిస్తున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాను మలేరియా రహిత జిల్లాగా మార్చే అవకాశం ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు.హైరిస్క్ గ్రామాలను గుర్తించి గ్రామాల్లో మలేరియా పిచికారి సక్రమంగా చేయకపోవడంతో దోమల వ్యాప్తి అధికమై మలేరియా కేసులు పెరుగుతుందన్నారు. జ్వర పీడితులకు ప్రత్యేక రక్త పరీక్షలు నిర్వహించాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలను తక్షణమే ప్రారంభించి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

'స్పెషల్ డీఎస్సీ' నిర్వహించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ గిరిజన యువత కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన సీపీఎం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల సమస్యలపై పోరాటాలు చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. జీవో నంబరు 3 పునరుద్ధరణ, భాషా వలంటీర్ల రెగ్యులర్, స్పెషల్ డీఎస్సీ నిర్వహణ, ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులను ఉపాధ్యాయులను నియమించాలన్న అంశాలపై అత్యవస పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం తమ పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనంతగిరి జెడ్పీటీసీ డి.గంగరాజు, సీపీఎం జిల్లా నాయకులు కిల్లో సురేంద్ర పాల్గొన్నారు.

ఆలయాలకు ఏకాదశి శోభ

- విశేషంగా అభిషేకాలు
- స్వామివార్లను దర్శించుకున్న భక్తులు


రంపచోడవరం: ఏకాదశ పర్వదినం సందర్భంగా బుధవారం టీటీడీ దేవస్థానానికి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ అధికారి నారాయణరాజు ఆధ్వర్యంలో పండితులు రామశర్మ ఘనపాఠి, అర్చక స్వాములు దీవి పార్థవెంకట రామశ్రీనివాస్, గోవర్ధనం, మణికంఠచార్యులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.రంపచోడవరం కోదండరాముని ఆలయంలో అర్చకుడు సాయికిరణ్ అభిషేకాలు నిర్వహించారు.



నారాయణగిరిపై శ్రీవారు

నారాయణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు విశేష పూజలు జరిపించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మప్రచార భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వెంకటరామా రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో నిర్వాహకులు

అగనంపూడి (విశాఖ) : వచ్చే నెలలో గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక బుధవారం గాజువాక మండలం, కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టారు. వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సారథ్యంలో కణితి హైస్కూల్‌లో నిర్వహించిన ఎంపికల్లో విశాఖ జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి రమణ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు జిల్లా వినుకొండ గుడ్‌షెఫర్డ్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొనుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూర్యనారాయణ, కణితి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.మన్నాజీ, పీడీలు నారాయణరావు, లోవరాజు, దేముడుబాబు, భవానీ, రవి, సుమన్ పాల్గొన్నారు.

23 నుంచి స్పెషల్ కేటగిరీ పత్రాల పరిశీలన

మద్దిలపాలెం(విశాఖ): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 23, 24, 25 తేదీల్లో పరిశీలిస్తున్నట్లు మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరిక్యులర్, క్యాప్(మాజీ సైనికుల పిల్లలు) ఉంటారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన స్పెషల్ కేటగిరీ విద్యార్థులు క్రిష్ణా కళాశాలలో జరిగే ధ్రువీకరణపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

రాజవొమ్మంగిలో డెంగ్యూ కేసు

వైద్యసిబ్బంది అప్రమత్తం

రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లిలో డెంగ్యూ కేసు నమోదైనట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ బుధవారం తెలిపారు. దీంతో కేసు నమోదైన పరిసర ప్రాంతాల్లో మలేరియా, డెంగూ నివారణ చర్యలు చేపట్టామని వారు పేర్కొన్నారు. బుధవారం రాత్రి సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారని వైద్యాధికారి తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలని, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించామని ఆమె పేర్కొన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా మురుగు గుంతల్లో లార్వా నివారణ మందు పిచికారీ చేపట్టినట్టు ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తున్నారు.



బడదనాంపల్లిలో దోమల నివారణ చర్యల్లో భాగంగా లార్వా నివారణకు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గైనిక్ సేవలు కరువు

- ముగ్గురు వైద్యుల్లో ఇద్దరు డిప్యూటేషన్‌పై పాడేరులో విధులు
- మిగతా ఒకరు సెలవు పెడితే చింతపల్లి ఆస్పత్రిలో గర్భిణులకు తప్పని అవస్థలు

చింతపల్లి రూరల్: స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రాంతీయ ఆస్పత్రిలో గైనాకాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో వైద్యసేవలు అందక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. బుధవారం వారపు సంత కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గర్భిణులు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. అయితే చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు గైనాకాలజిస్టులను ప్రభుత్వం నియమించింది. వీరిలో ఇద్దరు పాడేరు వైద్య కళాశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ సుధాశారద ప్రస్తుతం సెలవులో ఉన్నారు. గత 10 రోజులుగా గైనిక్ సేవలు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సుమారు 80 మంది గర్భిణుల వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. వీరికి ఆస్పత్రి సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించి, బీపీ చెక్ చేసి పంపించేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో గైనికాలజిస్టుల నియామకానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆరోగ్య పరీక్షల నిమిత్తం బుధవారం ఏరియా ఆస్పత్రిలో వేచి ఉన్న గర్భిణులు

క్లుప్తంగా

పెద్దేరు జలాశయంలో పెరిగిన నీటిమట్టం

- 200 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్ : మండలంలో రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపి పెరుగుతుంది. ఆడపా, దడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టాన్ని దృష్టిలో ఉంచుకుని జలాశయం నుంచి బుధవారం రాత్రి వర్షపు నీరు 200 క్యూసెక్కులు నీటిని స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రం నాటికి 136.50 మీటర్లకు చేరింది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 120 క్యూసెక్కులు నీరు చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ డి. ఈశ్వరరావు బుధవారం రాత్రి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి వారి వద్ద రూ.18,340 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల నియామకానికి చర్యలు



సమావేశానికి హాజరైన బీజేపీ నేతలు

కొయ్యూరు: మండలంలోని 33 పంచాయతీల్లో బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీల నియామకానికి చర్యలు తీసుకోవాలని గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు సూచించారు. రాజేంద్రపాలెం జిల్లా పరిషత్ అతిథి గృహంలో బుధవారం మండల అధ్యక్షుడు మురుకుర్తి అప్పలరాజు అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, జనసేన నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావు, మండల మహిళా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, కోశాధికారి సంపరి శివ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వనగల మల్లేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గాలి దేవుడు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నెల్లి సత్తిబాబు, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు గడుతూరి గోవింద్, మేడిబోయిన చక్రరావు పాల్గొన్నారు.

పర్యాటకానికి గ్రహణం!



- వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులపై నీలినీడలు?
- ముందుకు సాగని ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- అయోయంలో నేచ్యురల్ హిస్టరీ పార్క్, సైన్స్ మ్యూజియం, ఓషన్‌డెక్, అమ్యూజ్‌మెంట్ పార్క్ ప్రాజెక్టులు
- రూ.కోట్లు వెచ్చించి డీపీఆర్‌లు సిద్ధం చేసిన అధికారులు
- ఆ ప్రతిపాదనలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

విశాఖ సిటీ : విశాఖ పర్యాటకానికి గ్రహణం పట్టింది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను బుట్టదాఖలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం విభిన్నమైన, ఆకర్షణీయమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందుకు తగ్గట్టుగా విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కొన్ని కీలక ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రాజెక్టుల అభివృద్ధికి



ఓషన్ డెక్ డిజైన్

రూ.కోట్లు వెచ్చించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు సైతం రూపొందించింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ ఇచ్చిన ప్రతిపాదనలపై తాజా కూటమి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

విశాఖ అభివృద్ధి ఆటంకంగా..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రతి ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని భావించారు. దీంతో అమరావతికి ముప్పువాటిల్లుతుందని భావించిన చంద్రబాబు టీమ్.. విశాఖ ప్రతిష్టను దిగజార్చేలా అనేక కుట్రలకు పాల్పడింది. ఇందులో భాగంగా విశాఖ పర్యాటక అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిన ప్రణాళికలపై బురదజల్లే ప్రయత్నాలు చేసింది. ఎటువంటి పర్యాటక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా.. దాన్ని అడ్డుకోవడానికి ఏదో ఒక సాకుతో కేసులు వేయిస్తూ, సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ వచ్చింది. గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు నగరం అనువైన ప్రాంతం కాదని.. విశాఖ బ్రాండ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసింది. వైఎస్సార్ ప్రభుత్వం చేసే ప్రతి ప్రాజెక్టు రాకుండా చేయడానికి ప్రయత్నించిన చంద్రబాబు.. ఇప్పుడు గత ప్రభుత్వ ప్రతిపాదనలను సైతం పక్కనపెట్టాలని ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఫలితంగా విశాఖ పర్యాటకాభివృద్ధికి దోహదం చేసే ప్రాజెక్టుల ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల రూపకల్పనకు వీఎంఆర్‌డీఏ అధికారులు రూ.కోట్లు వెచ్చించి డీపీఆర్‌లు సిద్ధం చేయించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లని పక్షంలో డీపీఆర్‌లకు అయ్యే ఖర్చు వృథా కానుంది. 2014–19లో విశాఖలో ఒక్క ప్రాజెక్టును ప్రారంభించని టీడీపీ ప్రభుత్వం ఈసారైనా సిద్ధంగా ఉన్న ప్రాజెక్టు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేదా? అన్నది వేచి చూడాలి మరి.

పర్యాటక ప్రాజెక్టులకు అడుగులు పడేనా..



సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం

విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ పలు కీలక ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఈ ప్రాజెక్టుల అడుగులు ఇప్పుడు ముందుకు పడతాయో? లేదో? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- గ్లాస్ బ్రిడ్జ్‌పై నడుస్తూ సముద్ర అందాలను ఆస్వాదించేలా.. రూ.7.8 కోట్లతో వీఎంఆర్‌డీఏ పార్క్‌కు ఆగ్నేయంగా సముద్రం ఒడ్డు నుంచి సముద్రం లోపలకు 91 మీటర్ల పొడవుతో ఓషన్ డెక్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) డిజైన్ సిద్ధం చేసింది.
- కైలాసగిరిపై రూ.4.69 కోట్లతో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ అధికారులు పంపించిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- రూ.40 కోట్ల అంచనా వ్యయంతో పీపీపీ పద్ధతిలో అమ్యూజ్‌మెంట్ పార్క్, గేమింగ్, ఫన్, స్కేటింగ్, అక్వేరియం.. ఇలా అన్నీ రకాల ఆహ్లాద, వినోద కేంద్రాలు ఒకే చోట విశాఖ ప్రజలను అలరించేలా పోలీస్ బ్యారెక్స్ సమీపంలో వైశాఖి జల ఉద్యానవనం స్థలంలో 'ఎంటర్‌టైన్‌మెంట్, ఫన్ జోన్'కు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణకు వీఎంఆర్‌డీఏ బిడ్లు సైతం ఆహ్వానించింది.
- రూ.18 కోట్లతో కైలాసగిరిపై కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ ప్రాజెక్టు పనులను తిరిగి చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేసింది.
- కాపులుప్పాడ ప్రాంతంలో నేచురల్ హిస్టరీ పార్కు అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశారు.
- ఇలా మరికొన్ని పర్యాటక ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

20, 21 తేదీల్లో అప్పన్న దర్శన వేళల్లో మార్పు

ఆర్జిత సేవలు రద్దు



సింహాచలం: ఈ నెల 20న జరిగే గిరి ప్రదక్షిణ, 21న జరిగే వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ప్రదక్షిణ పురస్కరించుకుని స్వామి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 20, 21 తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన టికెట్లు, సాయంత్రం ఆరాధన టికెట్లు కూడా రద్దు చేసినట్లు చెప్పారు. ఈ రెండు రోజుల్లో ఆలయ నీలాద్రి గుమ్మం నుంచే భక్తులకు దర్శనాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా 20న గిరి ప్రదక్షిణ చేసి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 21న ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు సుప్రభాతసేవ, 2 గంటల నుంచి 3 గంటల వరకు తుది విడత చందన సమర్పణ ఉంటుందన్నారు. ఆ రోజు తెల్లవారు జామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి ఇస్తున్నట్టు వెల్లడించారు. ముందురోజు గిరి ప్రదక్షిణ చేసి సింహగిరికి చేరుకున్న భక్తులందరికీ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందిస్తామన్నారు. సాయంత్రం 4గంటల నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ ఉత్సవం నిర్వహిస్తామని, ఆ సమయంలో దర్శనాలు లభించవని స్పష్టం చేశారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు లభిస్తాయన్నారు.

20న సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభం

ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ సాయత్రం 4గంటలకు కొండదిగువ తొలిపావంచా నుంచి స్వామి పుష్పరథం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్లు రథం ప్రదక్షిణ చేసి తిరిగి రాత్రి 10 గంటలకు సింహాచలం చేరుకుంటుందని వెల్లడించారు.

సముద్రంలో బోటు బోల్తా

- సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు
- బోటు యజమానికి రూ.40 లక్షల నష్టం

మహారాణిపేట(విశాఖ): చేపల వేట కోసం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి పూడిమడక వైపు వెళ్లిన బోటు.. అప్పికొండ వద్ద ప్రమాదానికి గురైంది. బుధవారం సముద్రంలో అలల తాకిడి అధికంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలోకి దూకి.. ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వివరాలివీ.. ఈ నెల 14న ఫిషింగ్ హార్బర్ నుంచి దూడ దాసుకు చెందిన ఐఎన్‌డీ–ఏపీ–వీ5–ఎంఎం–245 బోటు వేటకు వెళ్లింది. అప్పికొండ వద్ద బుధవారం మత్స్యకారులు వేట సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణంలో మార్పులతో అలల తాకిడి పెరిగింది. ఇంకో వైపు ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో ఈ బోటు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బోటులో డ్రైవర్‌తో పాటు 8 మంది కలాసీలు ఉన్నారు. అప్పటికే వేటాడిన మత్స్య సంపద కూడా అందులోనే ఉంది. కాగా.. ఈ ఘటనలో బోటులో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈదుకుంటూ అప్పికొండ ఒడ్డుకు చేరుకున్నారని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. ఈ ప్రమాదంలో బోటు యజమానికి రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ ఘటనపై మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపి.. బోటు యజమానికి నష్టపరిహారం చెల్లించాలని జానకీరామ్ కోరారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు





స్వామివారి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు (ఇన్‌సెట్) నూతన వస్త్రాలంకరణలో అమ్మవారు

- తొలి ఏకాదశి నాడు స్వామి దర్శనం
- గాలిగోపురం వరకూ క్యూలైన్లు ఏర్పాటు

నక్కపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయం రద్దీగా మారింది. వీరి దర్శనానికి ఎటువంటి ఇబ్బంది పడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాలి గోపురం ఎదురుగా అఖిలాండం వరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులంతా క్యూలైన్లో నడిచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించిన పిదప భక్తులకు దర్శనం కల్పించామని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు శేషాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. అనంతరం కొండ దిగువన క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద, ఆండాళ్లమ్మ వారి సన్నిధిలో రోజువారి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారిని నూతన వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి నర్సీపట్నం, తుని, అడ్డురోడ్డు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో క్యూలైన్లో వెళ్లి స్వామివారిని దర్శించుకునేందుకు గంటకు పైగా సమయం పట్టింది. టీటీడీకి చెందిన విజిలెన్స్ విభాగం వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాయంత్రం ఉపమాకకు చెందిన శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో స్వామివారి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్

ఎస్.రాయవరం: గెడ్డపాలెం గ్రామానికి చెందిన టైల్స్ మేస్త్రీ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. టైల్స్ వర్క్ మేస్త్రిగా పనిచేస్తున్న కర్రి దుర్గ (40) రోజువారీ పనుల నిమిత్తం బుధవారం భీమవారం గ్రామానికి వెళుతుండగా ట్రాక్ దాటే క్రమంలో రైలును గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తుని నుంచి విశాఖ వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకుని అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, తొమ్మిదేళ్ల బాబు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టిక్కెట్ అడిగితే కండక్టర్‌పై దాడి

- ప్రయాణికుడిపై కేసు నమోదు

నర్సీపట్నం : నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ చిట్టిబాబుపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి తోటకూరపాలెం బస్సు బయలుదేరింది. అదే బస్సులో మాకవరపాలెం మండలం, కొండల అగ్రహారానికి చెందిన ఎస్.వెంకటేష్ బస్సులో ప్రయాణిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ చిట్టిబాబు అతడిని టిక్కెట్ తీసుకోమని కోరగా, వెంకటేష్ కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నాడు. ఈ ఘటనపై కండక్టర్ నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

సెప్టెంబర్‌లో టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు

తగరపువలస(విశాఖ) : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 35 టైప్ పరీక్షా కేంద్రాల్లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు తెలిపారు. సెప్టెంబర్ 28, 29న తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలతోపాటు ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌లలో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. అలాగే అదే నెల 21, 22న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6 కేంద్రాల్లో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ పరీక్షా కేంద్రాన్ని విజయవాడలో రద్దు చేసి గుంటూరులో నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు ఇంకా 70 రోజుల వ్యవధి ఉన్నందున అభ్యర్థులు గుర్తింపు పొందిన టైప్ ఇన్‌స్టిట్యూట్‌లను సంప్రదించి సమయం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 96522 76443లో సంప్రదించాలని కోరారు.

111 మంది ఎస్‌ఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధి ఏడు జిల్లాల్లో పనిచేసేందుకు 111 మంది ప్రమోటీ ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు 27 మంది, కృష్ణా జిల్లాకు 23 మంది, ఏలూరు జిల్లాకు 12 మంది, పశ్చిమగోదావరి జిల్లాకు 14 మంది, తూర్పు గోదావరి జిల్లాకు 13 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 9 మంది, కాకినాడ జిల్లాకు ఏడుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ) : పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో రీ షెడ్యూల్ చేశామని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి – సికింద్రాబాద్ (07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఏడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 11.25 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ – హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ – సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరింది. బుధవారం రాత్రి 7 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 గంటలకు బయల్దేరింది.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

ఎనిమిది మందికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

పాడేరు : పాడేరు–జి.మాడుగుల ప్రధాన రహదారిలో వాకపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పాడేరు నుంచి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు గూడెం వెళ్తుండగా వాకపల్లి వద్ద హైవే రహదారి పనుల్లో ఉన్న ఓ టిప్పర్‌ను రివర్స్ చేస్తున్న క్రమంలో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగంలో ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులను వేరే బస్సులో గూడెంకు తరలించారు. ఈ సంఘటనతో పాడేరు–జి.మాడుగుల మార్గంలో సుమారు అర గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ ఊడలమర్రి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కాకనూరు, మఠం భీమవరానికి చెందిన ఐదుగురు రెండు బైక్‌లపై ఎదురెదురుగా వస్తుండగా ఊడలమర్రి వద్ద ఆ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో వంతల చంద్రబాబు, సీరిబాల ధర్మరాజుల పరిస్థితి విషమంగా ఉండడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

బంగారం, నగదు అపహరణ



చోరీపై వివరాలు సేకరిస్తున్న పోలీసు కానిస్టేబుల్

కోటవురట్ల: పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దోచుకుపోయారు. బాధితులు లబోదిబో అంటూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. చౌడువాడ గ్రామానికి చెందిన గల్లా రమణ మంగళవారం ఉదయం గాజువాకలో ఉన్న తన కూతురును చూడడానికి వెళ్లారు. అతని భార్య గల్లా లక్ష్మి అదే రోజు ఉదయం 9 గంటల సమయంలో పొలంలోకి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికొచ్చారు. ఇంటి వెనక తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లగా బీరువా తెరిచి చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులను చూసి ఆందోళనతో బీరువా తెరిచి చూడగా అందులో దాచిన పావు తక్కువ నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి వస్తువులు, రూ.38,500 నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దోచుకుపోయినట్టు భావించి బుధవారం కోటవురట్లలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు గల్లా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాల కోసం పరిశీలించింది.